సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 5 । నవంబర్ । 2024



హర హర శంభో శంకర

ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారిని కార్తిక తొలి సోమవారం పురస్కరించుకుని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




8 లో

యుగ నారీమణి.. కందుకూరి రాజ్యలక్ష్మి

తన భార్య సహకారం లేకుండా సంస్కరణోద్యమం విజయవంతం కాదని యుగ పురుషుడు కందుకూరి వీరేశలింగం తన స్వీయ చరిత్రలో చెప్పారంటే..

54 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 54,179 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 8,300 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

సూపర్ సిక్స్ తక్షణం అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను తక్షణం అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా విద్యార్థులకు రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఇవ్వాలన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు, ఇతర హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. లేని పక్షంలో వివిధ సంఘాలతో కలిసి భవిష్యత్తులో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దేవ రాజేంద్రప్రసాద్, శీలం వెంకటేష్, కొండే రామకృష్ణ, శ్యామ్యూల్, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

అమలాపురం రూరల్: ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో డ్రైవర్ కె.శ్రీనివాసరాజుపై భీమవరం సమీపంలో కాళ్ల వద్ద జరిపిన భౌతిక దాడిని ఖండిస్తూ సోమవారం డిపో కార్మికులు ధర్నా చేశారు. గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రజా సేవ చేస్తున్న ఆర్టీసీ కార్మికులపై భౌతిక దాడులు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి, ఆర్టీసీ కార్మికులపై భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు చేయాలన్నారు. వాటిని తక్షణం అమలు చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఎలియా, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ కె.రవికుమార్, రంగ ప్రసాద్, ఎంప్లాయీస్ యూనియన్ నుంచి కె.రాంబాబు, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకుడు ఎస్ మోహన్‌రావు పాల్గొన్నారు.

కాణ్వియ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కాణ్వియ నూతన కార్యవర్గం

రావులపాలెం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కాణ్వియ బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాణ్వియ శాఖీయులు సుమారు 250 మంది హాజరయ్యారు. అనంతరం సంఘ సర్వసభ్య సమావేశాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరబొట్ల రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా దేవరపట్ల రాధాకృష్ణ, గౌరవాధ్యక్షుడిగా హనుమంతవఝుల అమరేశ్వరరావు, గౌరవ సలహాదారుగా గోదావరి తాతాలు, అధ్యక్షుడిగా పెడసనగంటి సుబ్రహ్మణ్య జగన్నాథ సంతోష్, ఉపాధ్యక్షుడిగా జోశ్యుల బాల లోకేశ్వర్, కార్యదర్శిగా గోదావరి వెంకటసత్య సర్వభద్రం, సహాయ కార్యదర్శిగా దేవరబొట్ల సత్యసాయి ఆదిత్య మరో నలుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వాణిజ్య పన్నుల అధికారుల తనిఖీ

అమలాపురం టౌన్: పట్టణంలోని ఓ బంగారు, వెండి దుకాణాన్ని రాజమహేంద్రవరం కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. నెల రోజులుగా సంబంధిత బంగారు, వెండి వ్యాపారి కమర్షియల్ ట్యాక్స్‌కు లెక్కలు చూపకపోవడం వల్ల అధికారులు నేరుగా వచ్చి రికార్డుల తనిఖీ నిర్వహించారు.

జిల్లా సమీక్ష మండలి సమావేశం వాయిదా

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చినందున మంగళవారం జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమీక్ష మండలి సమావేశం వాయిదా వేసినట్టు కలెక్టర్ కార్యాలయం సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. సమీక్ష మండలి సమావేశం నేపథ్యంలో కలెక్టర్ మహేష్‌కుమార్ తొలుత కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అయితే మండలి సమావేశం వాయిదా పడింది.

వశిష్ట నదీపాయలో పి.గన్నవరం మండలం ఉడిమూడిలంక వద్ద డ్రెడ్జింగ్



ఉడిమూడిలంక ప్రాంతంలో ఏర్పడిన నదీ కోత



గోదారమ్మకు కడుపుకోత

- ఇసుక కోసం అక్రమార్కుల డ్రెడ్జింగ్
- నదీ గర్భంలో సొంత కార్యకలాపాలు
- వశిష్ట నదీ పాయలో బాట ఏర్పాటు
- లంక గ్రామాలకు పెను ముప్పు!
- ఇప్పటికే తీవ్రమైన నదీ కోత
- కీలక నేత సమీప బంధువు కనుసన్నల్లో వ్యవహారం

కొందరి స్వార్థం పర్యావరణానికి పెనుముప్పుగా మారింది. పాలకుల అండదండలతో.. అక్రమార్జన కోసం గోదావరి నదీ గర్భాన్నీ చీల్చిచెండాడుతున్నారు. భవిష్యత్తులో ఎదురుకానున్న పెను ముప్పునూ పట్టించుకోకుండా, తమ ఖజానా నింపుకోవడానికి కోనసీమ లంక గ్రామాల ఉనికినీ ప్రశ్నార్థకం చేస్తున్నారు. పాలకుల అండతో దాష్టీకానికి పాల్పడుతున్న అక్రమార్కులను నిలదీసేందుకు అధికార యంత్రాంగం సాహసించక పోవడంపై కోనసీమ వాసులు మండిపడుతున్నారు.

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ ఉచిత ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తుండడంతో.. కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ఆగస్టు నుంచి ఇసుక కొరత పట్టి పీడిస్తుండడంతో ధర చుక్కలను తాకుతోంది. ఇదే అదనుగా టీడీపీ, జనసేన నేతలు అక్రమంగా ఇసుక తవ్వకాలు ఆరంభించారు. దొడ్డిదారిన తవ్వకాలలో ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నారు. సొంతంగా ర్యాంపు వేయడం, జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేయడంతో ఆగకుండా, ఓ అడుగు ముందుకేసి ఏకంగా గోదావరి నదీ పాయల్లో డ్రెడ్జింగ్‌తో ఇసుక తోడేస్తున్నారు. కూటమి నేతల ఈ బరి తెగింపు.. లంక గ్రామాలకు పెనుముప్పుగా పరిణమిస్తోంది.

గోదావరి నదీపాయల్లో అక్రమ తవ్వకాలలో ఇది పరాకాష్ఠ. పడవలపై డ్రెడ్జింగ్ యంత్రాలు ఏర్పాటు చేసి ఇసుకను తోడేస్తున్నారు. జిల్లాలో పి.గన్నవరం మండలం ఉడిమూడిలంకలో అనధికార ఇసుక ర్యాంపును ఏర్పాటు చేశారు. ఇది స్థానిక జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వగ్రామం కావడం గమనార్హం. ఇక్కడ అనధికార ర్యాంపు ఏర్పాటు చేసి ఇసుకతో పాటు, మట్టి తవ్వకాలకు సైతం సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఏకంగా వశిష్ట ఎడమ ఏటిగట్టు దిగువ నుంచి ఉడిమూడిలంక వరకు తాత్కాలిక రహదారి నిర్మిస్తున్నారు. ఇందుకోసం డ్రెడ్జర్లు తెచ్చి తవ్వకాలు మొదలెట్టారు. ఇక్కడ తాత్కాలిక రహదారులు ఏర్పడగానే మట్టిని, ఇసుకను తరలించనున్నారు. లంక గ్రామాలకు వెళ్లేందుకు నిర్మిస్తున్న వంతెన కోసం మట్టి తవ్వకాలకు అనుమతి తెచ్చుకునేందుకు ఇప్పటికే అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

అనుమతుల్లేకుండా..

పి.గన్నవరంలో గతంలోనూ ఇదే పరిస్థితి. లంక గ్రామాల్లోని పంట భూముల్లో వరదలకు ఇసుక మేటలు వేశాయని, పంట సాగుకు అనుకూలంగా మలుచుకునేందుకు ఇసుక మేటలు తొలగింపునకు అనుమతి పొందడం పరిపాటి. దాని ముసుగులో వందల టన్నుల ఇసుకను తరలించుకుపోవడం ఇక్కడ అక్రమార్కులకు అలవాటే. అయితే ఈసారి అటువంటి అనుమతులు కూడా లేకుండా, అక్రమ తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. స్థానికంగా ఒక కీలక ప్రజాప్రతినిధి వరుసకు సోదరుడు ఈ దందాకు సిద్ధమయ్యారు. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడం, స్థానికుల ఫిర్యాదుల పరంపరతో తప్పని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. డ్రెడ్జర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, వీఆర్వోను కాపలాగా ఉంచారు.

పొంచి ఉన్న పెను ముప్పు

గోదావరి నదీ పాయల్లో డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వకాలు చేయడం లంక గ్రామాలకు పెనుముప్పుగా మారింది. సహజ సిద్ధంగా గోదావరి నదీపాయల మధ్య ఏర్పడే ఇసుకను తవ్వడంపై పలు ఆంక్షలున్నాయి. హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుల నేపథ్యంలో.. ఇష్టానుసారం తవ్వకాలు చేసే అవకాశం లేదు. కానీ పి.గన్నవరం మండలంలో గతం నుంచి డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నదిపై కనిపించే ఇసుక తిన్నెలనే కాకుండా, నదిలో దిగువ భాగంలో లోతుగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. డ్రెడ్జింగ్ చేయడం వల్ల వశిష్ఠ నదీపాయ మధ్యన కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య చిన్న దీవిగా గంటి పెదపూడిలంక, ఉడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లంక భూముల్లో కొబ్బరి, అరటి, కోకో, కూరగాయ పంటలు, పండ్లు, పవ్వుల సాగు జరుగుతోంది. డ్రెడ్జింగ్ చేస్తూ అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల నదీ కోత ఉధృతి ఏటా పెరిగిపోతోంది. ఇప్పటికే సుమారు 50 ఎకరాల భూములు నదీ గర్భంలో కలిసిపోయాయని స్థానికులు వాపోతున్నారు. స్వార్థపరుల చేష్టలకు రైతుల విలువైన భూములు కోల్పోతున్నారు. ఈ తవ్వకాల వల్ల ఏటిగట్ల పటిష్టతకు సైతం ముప్పు వాటిల్లుతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ పరిధిలోని హెడ్ వర్క్స్ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానికులు బాట ఏర్పాటు చేసుకుంటారు



ఉడుమూడి గ్రామంలో డ్రెడ్జర్ ద్వారా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని మాకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్సైతో కలిసి పరిశీలించాం. స్థానికులు ప్రతి ఏటా రాకపోకల కోసం బాట వేసుకుంటారు. అలా బాట వేసుకోవాలన్నా.. డ్రెడ్జింగ్ చేయకూడదు. ఇక్కడ వీఆర్వోను కాపలా ఉంచాం.

– పల్లవి, తహసీల్దార్, పి.గన్నవరం

ఉమ్మడి జిల్లాలో క్విజ్ పోటీలు

అమలాపురం రూరల్: ఉమ్మడి జిల్లాలో ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్ 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో, 6న అమలాపురం అంబేడ్కర్ భవనంలో, 7న కాకినాడ అంబేడ్కర్ భవనంలో, అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబర్ 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కెనడా అమ్మాయి.. అమలాపురం అబ్బాయి

పెళ్లితో ఒక్కటైన జంట



కెనడా అమ్మాయి, అమలాపురం అబ్బాయిల పెళ్లి సన్నాహక సందడి

అమలాపురం టౌన్: కెనడా దేశానికి చెందిన యువతిని, అమలాపురానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకున్నాడు. అమలాపురం మండలం ఈదరపల్లి శివారు వైకుంఠపురానికి చెందిన మనోజ్‌కుమార్ కెనడా దేశంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ దేశానికి చెందిన సహ ఉద్యోగి ట్రేసీ రోచేడాన్ అతడికి పరిచయమైంది. ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. దీంతో కెనడా దేశంలో వధువు రోచేడాన్ సంప్రదాయం ప్రకారం ఇటీవల వారికి వివాహమైంది. అమలాపురానికి వచ్చిన ఆ జంట ఇక్కడ సంప్రదాయం ప్రకారం త్వరలో పెళ్లి చేసుకునేందుకు సోమవారం నుంచి సన్నాహాలు మొదలయ్యాయి. బంధుమిత్రులతో ఆ ఇంట పెళ్లి సందడి నెలకొంది.

ప్రభుత్వ విధానాలను ప్రక్షాళన చేయాలి

- ఉచిత ఇసుక అందని ద్రాక్షే..
- మితిమీరిన బెల్ట్ షాపులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని జనసేన నిర్ణయం

అమలాపురం టౌన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు మంగళవారం అమలాపురానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక, నూతన మద్యం విధానాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, లోపాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని ప్రక్షాళన చేయాలంటూ వినతిపత్రం ఇవ్వాలని జనసేన పార్టీ జిల్లా శ్రేణులు నిర్ణయించారు. ఈ మేరకు అమలాపురంలో ఆ పార్టీ నేతలు సోమవారం సమావేశమయ్యారు. ఇసుక, మద్యం తీరుతెన్నులపై సుదీర్ఘంగా చర్చించి, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై ఓ వినతిపత్రం రూపొందించారు. ఈ వినతిపత్రం సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

క్షేత్ర స్థాయిలో అలా లేదు

క్షేత్ర స్థాయిలో ఉచిత ఇసుక అమలు అందని ద్రాక్షగానే ఉందని జనసేన జిల్లా నేతలు ఆ వినతిపత్రంలో అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చేసిన ఉచిత ఇసుక ప్రకటన క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని, దీనివల్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించే పరిస్థితులు తలెత్తుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఓ ఆర్డినెన్స్ తెస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు.

బెల్ట్ షాపులతో ఇబ్బందులు

నూతన మద్యం పాలసీలో అధికారిక షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు మితిమీరి ఏర్పడడం వల్ల సామాన్య ప్రజానీకం చాలా ఇబ్బందులు పడుతోందని వినతిపత్రంలో ప్రస్తావించారు. దీనికితోడు మద్యం ధరలను ఎమ్మార్పీకి మించి అమ్ముతున్న వైనంపై వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వీటి ప్రభావం ప్రభుత్వంపై నేరుగా పడుతోందని వారు స్పష్టం చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో అర్జీదారులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేసి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి ఫిర్యాదులను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణారావు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. అర్జీల్లో కొన్ని కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు ఉండడంతో, అర్జీదారులకు ఎస్పీ పరిష్కార మార్గాలను సూచించారు.

పరిష్కార మార్గాలు చూపండి



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యలపై తక్షణమే స్పందించి, నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు, జేసీ నిశాంతి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.ఝాన్సీరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్‌మోహనరావు అర్జీదారుల నుంచి 180 అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్.. అర్జీదారుల సమస్యలను ఆలకించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న జిల్లా స్థాయి అధికారులకు సిఫార్సు చేశారు. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా, నిష్పక్షపాతంగా విచారణ చేసి, గడువులోగా పరిష్కార మార్గాలు నాణ్యతతో చూపాలన్నారు. పెండింగ్ దరఖాస్తులపైనా దృష్టి పెట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతి దరఖాస్తును 24 గంటల్లోగా సంబంధిత శాఖాధికారి లాగిన్ ఓపెన్ చేసి, పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కరించిన అర్జీలను అర్జీదారుని సంతకం ఫొటోలతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు రామకృష్ణారెడ్డి, సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మృత్యుపాశం



తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మృతుల బంధువుల రోదనలు

- బడుగు బతుకులను బలిగొన్న విద్యుదాఘాతం
- నలుగురు యువకుల దుర్మరణం
- మృతులందరూ రోజు కూలీలే..
- ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో విషాదం
- తమకు దిక్కెవరని రోదిస్తున్న బాధిత కుటుంబాలు

విద్యుదాఘాతానికి కారణమైన 25 అడుగుల ఫ్లెక్సీ



నిడదవోలు/ఉండ్రాజవరం: రోజంతా వారు రెక్కలు ముక్కలు చేసుకుంటేనే కానీ ఆ కుటుంబ రథాలు ముందుకు సాగని దుస్థితి. కొబ్బరి దింపు, ఇతర కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న ఆ బడుగులకు కరెంటు తీగలే మృత్యుపాశాలయ్యాయి. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆ నిర్భాగ్యులు అర్ధాంతరంగా తనువు చాలించడంతో.. ఇక తమకు దిక్కెవరంటూ వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందిన సంఘటన ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో తీరని విషాదాన్ని నింపింది.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని తాడిపర్రు గ్రామంలో ఆవిష్కరించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 25 అడుగుల ఆయన భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు కాస్తా పైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలాయి. దీంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో దానిని ఏర్పాటు చేస్తున్న కాసాని కృష్ణ (27), మారిశెట్టి మణికంఠ (29), పామర్తి నాగేంద్ర (26), బొల్లా వీర్రాజు (27) ఒక్కసారిగా తీవ్ర షాక్‌కు గురై, అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వారి మృతదేహాలను తణుకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తణుకు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావును మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. అతడికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు.

అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తూ..



ఈ ప్రమాదంలో మరో మృతుడు తాడిపర్రుకు చెందిన మారిశెట్టి మణికంఠ అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరేళ్లుగా మండపాలకు ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందరితో ఎంతో కలివిడిగా ఉంటున్న మణికంఠ మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. అతడికి భార్య భవానితో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరోవైపు వృద్ధులైన తల్లిదండ్రులు పద్దయ్య, లక్ష్మి కూడా మణికంఠ సంపాద పైనే ఆధారపడి బతుకుతున్నారు. పద్దయ్య గతంలో కొబ్బరి దింపు పనులు చేసేవారు. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించక ఇంటి వద్దే ఉంటున్నారు. అభిమాన నాయకుడి ఫ్లెక్సీ కట్టడానికి ఇంట్లో చెప్పి వెళ్లిన మణికంఠ అట్నుంచి అటే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడనే వార్తను కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేపోతున్నారు. నాలుగు రాళ్లు సంపాదించే బిడ్డను కోల్పోవడంతో ఇకపై తమను చూసుకునేదెవరంటూ వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబమంతా కొబ్బరి దింపు కూలీలే..



మరో మృతుడు బొల్లా వీర్రాజు (27) తల్లిదండ్రులు త్రిమూర్తులు, రామలక్ష్మితో పాటు కొబ్బరి దింపు కూలీగా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వీర్రాజుకు భార్య దుర్గాభవానితో పాటు 11 నెలల కుమార్తె ఉంది. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో భాగంగా స్నేహితులతో కలసి వెళ్లి ఫ్లెక్సీ ఏర్పాట్లలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో అతడు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

లేకలేక కలిగిన బిడ్డ



తాడిపర్రు గ్రామానికి చెందిన రాము, పద్మ దంపతులకు కాసాని కృష్ణ లేకలేక కలిగిన బిడ్డ. అవివాహితుడైన అతడు ప్రస్తుతం పెయింట్స్ షాపులో పని చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కృష్ణకు వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. తండ్రి రాము ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నారు. ఆయన అక్కడి నుంచి రాగానే కృష్ణకు వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. కృష్ణ తల్లి పద్మ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారు. విద్యుదాఘాతంతో కృష్ణ చనిపోయాడనే సమాచారాన్ని అతడి తల్లికి ఎలా చెప్పాలో తెలియక కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు.

పాపన్న గౌడ్‌పై అభిమానంతో వచ్చి..



తాడిపర్రు గ్రామానికి చెందిన పామర్తి నాగేంద్ర ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి శ్రీను కొబ్బరి దింపు పనికి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాగేంద్రకు ఏడాది క్రితం వివాహమైంది. భార్య లక్ష్మీదుర్గతో పాటు 9 నెలల కుమార్తె ఉంది. పాపన్నగౌడ్‌పై అభిమానంతో ఫ్లెక్సీ కట్టడానికి వెళ్లిన నాగేంద్ర అనంత లోకాలకు వెళ్లిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. విద్యుదాఘాతంతో నాగేంద్ర చనిపోయాడని చెప్పడంతో ఆ కుటుంబ సభ్యులందరూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.

క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


అరుణ్‌కుమార్(ఫైల్)

కడియం: జాతీయ రహదారిపై కడియ పులంక వద్ద మోటార్ బైక్ ఢీకొన్న ఘటనలో అమలాపురానికి చెందిన అడ్డాల అరుణ్ కుమార్(42) మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం, అరుణ్‌కుమార్ హైవేపై కాలినడకన వెళుతుండగా, దుళ్ల గ్రామానికి చెందిన సీహెచ్ శివకుమార్ మోటార్ బైక్‌తో అతడిని ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమై అరుణ్‌కుమార్ అక్కడికక్కడే చనిపోయాడు. అలాగే శివకుమార్ తలకు తీవ్ర గాయం కాగా, జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం


గాయపడిన గీత

నల్లజర్ల: కాపురానికి వచ్చేందుకు నిరాకరించిందన్న కోపంతో భార్యపై భర్త కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు, అనంతపల్లి ఎన్టీఆర్ కాలనీకి చెందిన మజ్జి నాగేశ్వర రావు కుమార్తె గీత (34)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు. కుటుంబ కలహాలతో భార్యాభర్తలు చట్టబద్ధంగా విడిపోయారు. ఆమె తండ్రి వద్దే ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటోంది. పెదపూడి మండలం సంపరకు చెందిన దేగల శ్రీరాములును ఆమె గుళ్లో పెళ్లి చేసుకుంది. అతడు దురలవాట్లకు బానిసై జులాయిలా తిరుగుతుండడంతో, ఇటీవల అతడిని ఇంటి నుంచి గెంటేసింది. సోమవారం ఉదయం ఆమె ఇంటికి వచ్చి కాపురానికి రావాలని అతడు పట్టుబట్టాడు. పెద్దల మధ్య రాజీ తర్వాతే పంపుతానని గీత తండ్రి చెప్పాడు. సాయంత్రం వస్తానంటూ వెళ్లిన శ్రీరాములు, బ్యాంకు నుంచి వస్తున్న గీతపై కత్తితో దాడి చేశాడు. ఆమె వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా పంచాయతీ ఆఫీసులో పనిచేస్తున్న మనెల్లి పవన్‌కుమార్ అడ్డుకుని, శ్రీరాములును ఇటుక రాయితో తలపై కొట్టాడు. దీంతో శ్రీరాములు కత్తి అక్కడే పడేసి బైక్‌పై పరారయ్యాడు. గాయపడిన గీతను 108లో రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి తరలించారు. నల్లజర్ల, దేవరపల్లి ఎస్సైలు సోమరాజు, సుబ్రహ్మణ్యం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల: పౌర సరఫరాల శాఖ ఏఎస్ఓ నాగాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం నల్లజర్లలోని ఓ రైస్ మిల్లుపై దాడి చేశారు. అక్కడ షెడ్‌లో దాచి ఉంచిన రూ.1.29 లక్షల విలువైన 2.850 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కేవీఎస్ఎం ప్రసాద్ తెలిపారు.


కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు


భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం


మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకంలో పాల్గొన్న భక్తులు


ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి చేస్తున్న ప్రత్యేక పూజలు

హర హర శంభో శంకర

కార్తిక తొలి సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలతో పాటు, పట్టణాలు, పల్లెల్లోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తొలి సోమవారం అభిషేకాలు, పూజలు, పుణ్యస్నానాలు, దీపాలంకరణలతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

- గోదావరి తీరంలో పోటెత్తిన భక్తజనం
- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- ప్రముఖ క్షేత్రాల్లో భక్తుల తాకిడి
- గోదావరి నదీ పాయల్లో పుణ్యస్నానాలు


కుండలేశ్వరం వద్ద నదిలో భక్తుల పుణ్యస్నానాలు


పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారికి చేస్తున్న అభిషేకం

సాక్షి, అమలాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారిని కార్తిక తొలి సోమవారం పురస్కరించుకుని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కోటిపల్లి సోమేశ్వరస్వామి ఆలయానికి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సమీపంలోని గౌతమీ నదీపాయలో పుణ్యస్నానాలు చేశారు. కొత్తపేట మండలం పలివెల గ్రామంలో ఉమా కొప్పేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అన్న ప్రసాదం కమిటీ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలోని పార్వతి సమేతంగా వేంచేసి ఉన్న కుండలేశ్వరుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులు గోదావరి స్నానాన్ని ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వర స్వామివారిని సుమారు పది వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు పవిత్ర వృద్ధ గౌతమీ నదిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. 367 పంచామృతాభిషేకాలు, 359 లఘున్యాస అభిషేకాలు జరిగాయి. రాజోలు మండలం కడలి కపోతేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, అమలాపురం చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పుష్కరాల రేవుకు పోటెత్తిన భక్తులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): శివకేశవులకు ప్రీతికరమైన కార్తికమాసం తొలి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే జిల్లాలో అన్ని ప్రధాన గోదావరి స్నానఘట్టాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు వద్ద జనం తాకిడి అధికంగా కనబడింది. పుణ్యస్నానాలు చేసిన భక్తులు పుష్కరాలరేవులో దీపాలు వెలిగించి, గోదావరి జలాల్లోకి విడిచిపెట్టారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో జరిగిన అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, భువనేశ్వరీదేవికి కుంకుమార్చనలు చేశారు. శృంగేరీ శారద శంకరమఠంలో చంద్రమౌళీశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. టి.నగర్‌లోని విశ్వేశ్వర స్వామి ఆలయం, జాంపేట ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన రుద్రాభిషేకాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో..

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం తొలి సోమవారం కావడంతో తెల్లవారుజామున ఆలయంలో గోపూజ చేసి స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణంతో మార్మోగింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు చేశారు. ఆర్టీసీ అధికారులు పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కిటకిటలాడిన పాదగయ

పిఠాపురం: కార్తిక మాసం తొలి సోమవారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులు పుణ్యస్నానాలు చేసి, ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. పాదగయ పుష్కరిణి నీటితో శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు.

తండ్రిని కడతేర్చిన కొడుకు

ఆస్తి తగాదాలే కారణం!


తాతారావు మృతదేహం

తొండంగి: భూమి పంపకాల్లో తనకు నచ్చిన వాటాను ఇవ్వలేదన్న కక్షతో తండ్రిని పెద్ద కొడుకు కర్రతో కొట్టి హతమార్చిన ఘటన కోన ప్రాంతం జి.ముసలయ్యపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, జి.ముసలయ్యపేటకు చెందిన యాదాల తాతారావు(66)కు ఇద్దరు కుమారులు అర్జున్, గోవిందు, కుమార్తె ఉన్నారు. తాతారావుకు తొమ్మిది ఎకరాల భూమి ఉంది. ముగ్గురు సంతానానికి సమానంగా మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేశాడు. చిన్న కుమారుడైన గోవిందుకు రొయ్యల చెరువు ఉన్న భూమి రాగా, అర్జున్‌కు ఖాళీ భూమి వాటాగా వచ్చింది. అయితే గోవిందుకు వచ్చిన రొయ్యల చెరువు భూమిని జీవనం కోసం తండ్రి తాతారావు తన వద్దే ఉంచుకున్నాడు. ఆస్తి విషయమై తరచూ పెద్ద కుమారుడు అర్జున్ తండ్రి, తమ్ముడితో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి అర్జున్ మేనత్త సన్ని దండమ్మ ఇంట్లో తాతారావు, ఇతర కుటుంబ సభ్యులు నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అర్జున్ ఇంటి తలుపులు బలవంతంగా తెరిచి, కర్రతో తండ్రిపై దాడి చేశాడు. దీంతో మేనత్త దండమ్మ పెద్దగా కేకలు వేసింది. మేనత్తతో పాటు, తండ్రి తాతారావుపై అర్జున్ కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన తాతారావు అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు మృతుడి చిన్న కుమారుడు గోవిందు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నమండలో వృద్ధుడి హత్య

ఇంట్లో నగదు, బంగారం చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు: అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వచ్చిన వృద్ధుడిని హతమార్చి, ఇంట్లో సొత్తును చోరీ చేసిన ఉదంతం పొన్నమండ గ్రామంలో జరిగింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన మెడబల జగ్గారావు(85) హతమయ్యాడు. సోమవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రాజోలు సీఐ కె.నరేష్‌కుమార్, హతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి జగ్గారావు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఎంతకూ ఇంట్లోకి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ద్రౌపది పెరట్లో భర్త కోసం వెతకగా, జగ్గారావు రక్తపు మడుగులో పడిఉన్నాడు. ఆమె వేసిన కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని, పోలీసులకు సమాచారమిచ్చారు. 2002లో మృతుడి భార్య ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన ఓ పాత నేరస్తుడు ఆమె మెడలో బంగారు గొలుసును తస్కరించాడు. ఈ ఘటనపై జగ్గారావు, అతడి భార్య అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఈ క్రమంలో ఆ పాత నేరస్తుడు.. జగ్గారావు, అతడి భార్యపై కక్ష పెంచుకున్నాడని, జైలు నుంచి వచ్చినప్పటి నుంచి వారిని బెదిరిస్తున్నాడని మృతుడి మనవడు సత్యాది శ్రీకాంత్ తెలిపారు. హత్య సంఘటన అనంతరం ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.40 వేల నగదు, 39 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తన తాత జగ్గారావును పాత నేరస్తుడే హతమార్చి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలం నుంచి క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ పాత నేరస్తుడి ఆచూకీ లేకపోవడంతో, పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


తలుపులయ్య మృతదేహం

జగ్గంపేట: నరేంద్రపట్నం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి అదే గ్రామానికి చెందిన పోతురాజు తలుపులయ్య(47) మృతి చెందాడు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ వివరాల మేరకు, ఉదయం వ్యవసాయ పనుల కోసం అటవీ ప్రాంతం మీదుగా అతడు బయలుదేరాడు. మార్గం మధ్యలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై రఘునాథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య


చక్రధర్(ఫైల్)


కాలువలో చక్రధర్ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

జగ్గంపేట: పోలవరం కాలువలో జగ్గంపేట శివారున నీటిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, జగ్గంపేటకు చెందిన చిక్కాల చక్రధర్ (27) మోటార్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడి చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. బంధువుల ఇంటి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి తాను చనిపోతున్నట్టు తన మిత్రుల సెల్‌ఫోన్లకు మెసేజ్ పంపించాడు. దీంతో అతడి మిత్రులు వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా, అతడి ఆచూకీ లభ్యం కాలేదు. తెల్లవారుజామున జగ్గంపేట శివారున గుర్రంపాలెం సమీపంలోని పోలవరం కాలువ వద్ద చక్రధర్ చెప్పులు, మోటార్ బైక్, టోపీ లభ్యమయ్యాయి. అదే ప్రాంతంలోని కాలువలో పోలీసులు గాలింపు చేపట్టగా, అతడి మృతదేహం లభ్యమైంది. అతడికి ఎటువంటి ఆర్థిక, ఇతర ఇబ్బందులు లేవని చక్రధర్ స్నేహితులు తెలిపారు. ఎస్సై రఘునాథరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యుగ నారీమణి.. కందుకూరి రాజ్యలక్ష్మి

ఆమె పతి ఓ యుగ పురుషుడు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అడుగులు కలిపిన సతీమణి ఆమె. సమాజోద్ధరణ కోసం చారిత్రక వితంతు పునర్వివాహాలకు భర్త నడుం బిగించిన తరుణంలో.. ఎన్నో సామాజిక వ్యతిరేక శక్తులు ఆయనను అడ్డుకునేందుకు యత్నించాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆయన వెన్నంటి నిలిచిన మహా ధీశాలి ఆమె. ఆ మహానుభావుడు కందుకూరి వీరేశలింగం.. ఆయనకు దన్నుగా నిలిచిన వీర నారీమణి కందుకూరి రాజ్యలక్ష్మి. అటువంటి యుగ నారీమణి 173వ జయంతి మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

- భర్త ఆశయాల్లోనూ.. అడుగులో అడుగేసిన ధీర వనిత
- వితంతు పునర్వివాహాల్లో వెన్నంటి నిలిచిన ధీశాలి
- మొక్కవోని ధైర్యం ఆమె సొంతం
- నేడు 173వ జయంతి


కందుకూరి దంపతుల సమాధులు (ఆనంద గార్డెన్స్)


వితంతు పునర్వివాహం జరిగిన కల్యాణ వేదిక


వంకాయల వారి వీధిలోని రాజ్యలక్ష్మి నివాసం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తన భార్య సహకారం లేకుండా సంస్కరణోద్యమం విజయవంతం కాదని యుగ పురుషుడు కందుకూరి వీరేశలింగం తన స్వీయ చరిత్రలో చెప్పారంటే.. కందుకూరి రాజ్యలక్ష్మి ఎంత త్యాగమూర్తో అవగతమవుతుంది. తూర్పు గోదావరి జిల్లా కంతేరు గ్రామంలో 1851 నవంబర్ ఐదున బాపమ్మ జన్మించారు.

భర్త అడుగు జాడల్లో..

వితంతు వివాహాలకు వీరేశలింగం నడుము బిగించినప్పుడు పెద్ద దుమారమే చెలరేగింది. విమర్శలు గుప్పించేవారు కొందరైతే.. భౌతిక దాడులకు తెగబడ్డ వారు మరికొందరు. బంధువులంతా రాజ్యలక్ష్మి చెవిలో పోరేవారు. భర్తను వదిలేస్తానని బెదరించాలని సమీప బంధువులు సలహాలిచ్చేవారు. 'నా భర్త చేస్తున్నది సరైన పనే అని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని ఆమె బంధువులకు స్పష్టం చేశారు. చివరికి వంట వాళ్లను, వివాహ తంతు జరిపే పురోహితులను రాకుండా ఛాందసవాదులు బెదిరించారు. సమీపంలోని గోదావరి రేవు నుంచి రాజ్యలక్ష్మి స్వయంగా బిందెలతో నీళ్లు తెచ్చి, వంటలు సిద్ధం చేసేవారు. వివాహాలకు సిద్ధమైన వితంతువులను తమ ఇంట్లో, వివాహం అయ్యే వరకూ రహస్య పునరావాసం కల్పించారు. అనాథ శిశువులను చేరదీసి, ఆదరించారు.

వితంతువులకు విద్యాబుద్ధులు

భర్త స్థాపించిన వితంతు శరణాలయంలోని వితంతువులకు విద్యాబుద్ధులు నేర్పించేవారు. వారికి పునర్వివాహం జరిపినప్పుడు పెళ్లిపీటలపై ఈ దంపతులు కూర్చుని కన్యాదానం చేసేవారు. ఆమె నివసించే ఆనందాశ్రమారామంలో వితంతువుల కోసం ఒక ప్రార్థనా సమాజాన్ని నెలకొల్పారు. ప్రతి రోజూ ప్రార్థనలు జరిపేవారు. సంగీతాన్ని అభ్యసించి, భగవద్భక్తిపరమైన కీర్తనలు రచించారు. ఆమె కీర్తనలు, పాటల పుస్తకాన్ని రచించారని చాలా మందికి తెలియదు.

తుది శ్వాస విడిచే వరకు..

రేపు ఉదయం లేవగానే ప్రేమావతి(ఓ వితంతువు బిడ్డ)ని డాక్టర్ వద్దకు తీసుకెళ్లి మందు ఇప్పిస్తాను. 1910 ఆగస్టు 11న రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు రాజ్యలక్ష్మి తన భర్తకు చెప్పిన మాటలివి. ఆమె పూర్తి ఆరోగ్యంగానే ఉండటంతో ఆవే ఆమె చివరి మాటలవుతాయని కందుకూరి వీరేశలింగం ఊహించలేదు. సాధారణంగా తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నిద్రలేచి, బయట తోటలోకి ఆహ్లాదం కోసం వెళ్లడం కందుకూరికి అలవాటు. కిందికి వెడుతున్నారా? దీపం ఉందా? జాగ్రత్తగా వెళ్లండి. అంటూ రాజ్యలక్ష్మి చెప్పడం రివాజు. ఆ మాటలు ఆ రోజున కందుకూరికి వినపడలేదు. తిరిగి వచ్చిన వీరేశలింగం ఆమెను నిద్రపోతున్నావా? అని అడిగారు. సమాధానం లేదు. కాసేపు ఆయన మంచంపై పడుకుని, తిరిగి ఐదు గంటలకు లేచి, ఇంకా మెలకువ రాలేదా? అని ఆమెను తట్టారు. ఆమె శరీరం చల్లగా తగిలింది. ఆమెను పరిశీలించిన వైద్యుడు.. ఆమె మరణించిందని చెప్పాడు. భర్త సంస్కరణోద్యమానికి చివరి వరకు చేదోడుగా నిలిచిన రాజ్యలక్ష్మి సుమంగళిగా కన్నుమూశారు.

వధువుకు తొమ్మిదేళ్లు.. వరుడికి 13

వధువు వయస్సు తొమ్మిదేళ్లు. పేరు బాపమ్మ. వీధి బడి చదువులో తెలుగు భాషలో ఆమె కొంత ప్రవేశం సాధించింది. వరుడికి 13 ఏళ్లు. ఆయన పేరు కందుకూరి వీరేశలింగం. హైస్కూల్ విద్యార్థి. ఈ వధూవరులకు వివాహమంటే ఏమిటో, ఎందుకో తెలియదు. వీరేశలింగం మాటల్లో.. బొమ్మల పెండ్లి వలె మా వివాహం నడిచినది. పిండి వంటలు తినుట, వాద్యములు వినుట, నృత్యములు గనుట అప్పుడు మాకాహ్లాదకరములుగనే యుండియుండును. వివాహమయ్యాక వీరేశలింగం తల్లి తన కోడలు బాపమ్మ పేరును రాజ్యలక్ష్మిగా మార్చారు.

సంఘ సంస్కరణల్లో పాల్గొన్న ఆదర్శ మహిళ

రాజ్యలక్ష్మమ్మ తన కోసం బతికిన కాలం అల్పం. దాదాపు నాలుగు దశాబ్దాలు భర్త కందుకూరితో సంఘ సంస్కరణ కార్యకలాపాల్లో పాల్గొన్న ఆదర్శ మహిళ ఆమె. స్త్రీ జాతి సముద్ధరణ కోసం భర్తతో పాటు కంకణం కట్టుకున్న నారీమణి రాజ్యలక్ష్మమ్మ. భర్త ఆశయాలు, అభిరుచులకు అనుగుణంగా ఉంటూనే, అడుగడుగునా అండదండలు అందించి, నేటి మహిళలకు ఆదర్శమై నిలిచారు.

– పి.విశాలాక్షి, అధ్యాపకురాలు ఎస్‌కేఆర్ డీఎడ్ మహిళా కళాశాల

అనితర సాధ్యం.. రాజ్యలక్ష్మి జీవితం

భర్త అడుగుజాడల్లో నడుస్తూనే, ఆయన ఆశయాలకు, అభిరుచులకు అనుగుణంగా వర్తిస్తూనే అడుగడుగునా అండదండలు అందించిన మహిళా మణిగా రాజ్యలక్ష్మమ్మ ఖ్యాతి గడించారు. వివాహితగా ఆమె మెట్టినింట కాలు పెట్టే నాటికి ఆంధ్ర మహిళల దుస్థితి ఘోరాతి ఘోరం. బాల్య వివాహాలు, వితంతువు పునర్వివాహ నిషేధం, ఇంకా ఇతర అంధ విశ్వాసాలు నాడు స్త్రీ జాతికి శాపంగా పరిణమించాయి. అలాంటి స్థితిలో భర్త కందుకూరికి సహధర్మచారిణిగా, ఆయన సాంఘిక సంస్కరణల్లో శక్తికి మించి పాలుపంచుకున్న ధీర వనిత రాజ్యలక్ష్మమ్మ.

– కేఎస్ అన్నపూర్ణాదేవి, కందుకూరి రాజ్యలక్ష్మమ్మ చరిత్ర పరిశోధకురాలు